నమస్తే తెలంగాణ



## ఇరుగు పొరుగు ఇకమత్.. ఇగురం లేని రేవంత్


మొదటిపేజీ తరువాయి...

141.4 టీఎంసీలు, మిగులు జలాల్లో మరో 106 టీఎంసీలను గోదావరి-కావేరీ ప్రాజెక్టు కింద తరలించుకుపోతామని, దీని ప్రాతిపదికననే ఈ అనుసంధాన ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్టు ఎన్‌డబ్ల్యూడీఏ తన నివేదికలో పొందుపరిచింది. కానీ తాజాగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.45 వేల కోట్లతో రెండు ప్రాజెక్టులను చేపట్టి ఆ మేరకు తమ కేటాయింపుల్ని వినియోగించుకుంటామని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం వాటికి అనుమతి కూడా ఇచ్చినట్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రే ప్రకటించారు. కేంద్ర జల సంఘం లెక్కల ప్రకారం ఏటా గోదావరిలో వచ్చే వరదలో ఇంద్రావతి నుంచి వచ్చి కలిసే వరద 22.93 శాతంగా ఉంటుంది. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ ఇంద్రావతిని కట్టడి చేయడమంటే ఇప్పుడు దిగువకు వస్తున్న నీటిలో పావు వంతు నీళ్లు ఇక ముందు రావని తేలిపోయింది. ఇక, మిగిలిందల్లా మిగులు జలాలు! అసలు గోదావరిలో మిగులు ఉందా? లేదా? అనేది నేటికీ శాస్త్రీయంగా తేలలేదు. ఇదే సమయంలో తెలంగాణకు కేటాయించినది 968 టీఎంసీలు. ఇందులో ఎస్సారెస్పీ-90, దేవాదుల-38 టీఎంసీలు, సీతారామ-70 టీఎంసీలు, సమ్మక్క బరాజ్-50 టీఎంసీలు, కాళేశ్వరం, ఇతరత్రా ప్రాజెక్టులు కలుపుకుంటే 600 టీఎంసీలకు పైగా వినియోగించుకున్నాం. కానీ మేడిగడ్డను పునరుద్ధరించకపోవడంతో వినియోగం 400 టీఎంసీల పైచిలుకు మాత్రమే ఉంది. అంటే మన కేటాయింపుల్లో ఇంకా 400-500 టీఎంసీలు దిగువన సముద్రంలోకి పోతున్నాయి. వీటిని కూడా కేంద్రం, చంద్రబాబు వృథాజలాలుగా పరిగణించి ప్రజల్ని మభ్య పెడుతున్నారు. చంద్రబాబు చెప్పే మాటల్లో ఏమాత్రం నిజం లేదు. తెలంగాణకు అన్యాయం చేయనంటూనే తీవ్ర అన్యాయానికి పాల్పడుతున్నాడు. బాబు మాటలు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరు. నమ్మితే మాత్రం తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.

# 3 వేల టీఎంసీలు ఎక్కడ?


- **47 ఏండ్లలో పోలవరం వద్ద నమోదైన వరద 2,638.1 టీఎంసీలే**
- **జూలై - అక్టోబర్ మధ్య నాలుగు నెలల్లోనే 70-80 టీసీల ఇన్‌ఫ్లో**
- **సముద్రంలోకి పోగా 8 నెలలకు మిగిలేవి 527 టీఎంసీలు మాత్రమే**

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 21 (నమస్తే తెలంగాణ): 'ప్రతి సంవత్సరం గోదావరిలో వృథాగా 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయి. అందులో 200 టీఎంసీలు బనకచర్ల కింద మేం వాడుకుంటే ఎవరికైనా ఎందుకు అభ్యంతరం ఉండాలి' అని చంద్రబాబు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. సాధారణంగా ఎవరైనా ఇది వింటే నిజమే కదా! అనుకుంటారు. కానీ ఇందులోనే అసలు మర్మం దాగి ఉందని చంద్రబాబుకూ తెలుసు. వాస్తవానికి గోదావరి బేసిన్‌లో ఇన్‌ఫ్లోలు (వరద) ఏడాది పొడవునా స్థిరంగా ఉండవు, డైనమిక్‌గా ఉంటాయనేది సాగునీటి రంగ నిపుణులు మొదటి నుంచి చెప్తారు. ఇందుకు ఆధారంగా గతంలో కేంద్ర జల సంఘం 1966-67 నుంచి 2012-13 వరకు గోదావరిలోని వరదలపై ఒక విశ్లేషణ చేసింది. ఈ 47 సంవత్సరాల్లో ప్రతి సంవత్సరం నెలవారీగా గోదావరిపై పలు ప్రాంతాల్లో ఎన్ని జలాలు పోయాయనేది లెక్కించింది. ఇందులో భాగంగా పెరూర్, పోలవరం దగ్గర ప్రవహించిన జలాల సరాసరిని పరిగణలోనికి తీసుకుంది. దీని ప్రకారం పెరూర్ దగ్గర 47 ఏండ్లలో సరాసరిన 2,430 టీఎంసీల జలాలు పారాయి. పోలవరం వద్ద ఈ 47 సంవత్సరాల్లో సరాసరిన 2,638.1 టీఎంసీల వరద నమోదైంది. ఇందులో కేవలం జూలై నుంచి అక్టోబర్ వరకు అంటే నాలుగు నెలల్లోనే 70-80 శాతం ఇన్‌ఫ్లోలు నమోదయ్యాయి. అంటే పోలవరం వద్ద నుంచి సముద్రంలోకి పోయే వరద 2,638 టీఎంసీలనే లెక్కలోకి తీసుకున్నా ఇందులో 80 శాతం అంటే 2,110 టీఎంసీలు జూలై నుంచి అక్టోబర్ వరకుండే నాలుగు నెలల్లోనే చెల్లిపోతాయి. అంటే ఏడాదిలో 8 నెలలకు మిగిలేవి 527 టీఎంసీలు మాత్రమే. అంటే సగటున నెలకు 65 టీఎంసీలే. అంటే వర్షాకాలంలోనే భారీ ఎత్తున వరదలు రావడం, తదుపరి ఎనిమిది నెలల్లో మోస్తరు, స్వల్ప ఇన్‌ఫ్లోలు ఉంటాయనేది దీని ద్వారా అర్థమవుతుంది. జూలై-అక్టోబరు వరకు వర్షాలు కురుస్తుంటాయి. రిజర్వాయర్లు, చెరువులు అన్నీ నీటితో నిండుగా ఉంటాయి. భూగర్భజలాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఈ క్రమంలో ప్రాజెక్టుల ద్వారా ఎత్తిపోతల అనేది ఉండదు. అందుకే మిగిలిన ఎనిమిది నెలలే అత్యంత కీలకం. ముఖ్యంగా వర్షాకాలం పంటలు ముగిసిన తర్వాత జలాశయాల్లో నీటిమట్టం తగ్గుతుంది. తదుపరి యాసంగి పంటలకు సాగునీరు కావాలి. అప్పుడు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నదిలో ఉండే మోస్తరు, స్వల్ప ఇన్‌ఫ్లోలను ఎత్తిపోసుకోవాలి. చంద్రబాబు చెప్పే బనకచర్ల ప్రాజెక్టు నుంచి కూడా వర్షాకాలంలో నీటి మళ్లింపు అనేది ఉండదు. మిగిలిన ఎనిమిది నెలల్లోనే ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరిజలాలను మళ్లిస్తారు. ఎగువ రాష్ట్రాలకు సైతం అదే సమయంలో నదీజలాలు అవసరమవుతాయి. ఆ 8 నెలల్లో అందుబాటులో ఉండేది కేవలం 500 టీఎంసీలు.. అదీ వానలు బాగా పడితేనే. బనకచర్లతో చంద్రబాబు, కావేరీ అనుసంధానంతో కేంద్రం ఆ జలాలకే ఎసరు పెట్టేందుకు కుట్ర పన్నుతున్నాయి. మరి ఉన్న నీళ్లు వాళ్లు ఎత్తుకు పోతే తెలంగాణ పరిస్థితి ఏం కావాలి?




### మిగులు బూటకమంటున్న కేంద్ర సంస్థలు

దేశంలో నదీజలాలకు సంబంధించి కేంద్ర జల సంఘం, నదుల అనుసంధాన ప్రాజెక్టులను చేపట్టే నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) నివేదికలే ప్రామాణికం. ఈ క్రమంలో అసలు గోదావరిలో మిగులుజలాలు అనేవే లేవని స్వయంగా కేంద్ర జల సంఘమే తేల్చి చెప్పింది. 75 శాతం డిపెండబులిటీ (బచావత్ అవార్డు) ప్రాతిపదికన పోచంపాడు (శ్రీరాంసాగర్) ప్రాజెక్టు దిగువన వినియోగంలో ఉన్న, నిర్మాణమవుతున్న, భవిష్యత్తులో చేపట్టే సాగునీటి ప్రాజెక్టులను పరిగణలోనికి తీసుకొని లెక్కిస్తే 157 టీఎంసీల లోటు ఉందని తన తాజా అధ్యయనంలో తేల్చింది. కేంద్ర జల సంఘం నివేదిక (నంబరు 1/2018/ఎన్అండబ్ల్యూ) ప్రకారం 75 శాతం డిపెండబులిటీపై అసలు మిగులుజలాలే లేవని తేల్చి చెప్పింది. ఇక, 50 శాతం డిపెండబులిటీపై శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువన 569 టీఎంసీల మిగులుజలాలు ఉన్నాయని చెప్పగా, 50 శాతం డిపెండబులిటీపై 387.75 టీఎంసీల మిగులు ఉందని స్పష్టం చేసింది. ఈ క్రమంలో మిగులు జలాలు అనేవి కేవలం ఒక రాష్ట్ర హక్కుగా ఉండవు. వీటిని కూడా బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. రాజ్యాంగం ప్రకారమైతే ఆ బాధ్యత ను ట్రిబ్యునల్ చేపట్టాలి. కృష్ణా బేసిన్‌లో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఆ ప్రక్రియను చేపట్టింది. కానీ గోదావరిలో ఆ ప్రక్రియ జరగలేదు. అంతమాత్రాన అవి సముద్రంలో కలిస్తే దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు, ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు కేంద్రానికి హక్కు ఉండదు.



1. **Water Balance Studies of NWDA**
As per the latest Water Balance Studies of Godavari basin of NWDA based on the completed, ongoing and future notified projects in the Sub-Basins below Pochampadu (Sriramsagar) Project, there is no surplus water available at 75% dependability.

Water Balance Studies of Godavari basin as per latest NWDA Reports

| Sub-Basin | Water Balance at 75% Dependability (MCM) | Water Balance at 50% Dependability (MCM) |
|---|---|---|
| Sabari | 8933 | 11579 |
| Lower Godavari | -19370 | -17950 |
| Indravati | 8193 | 12104 |
| Pranahita | 5045 | 10946 |
| Wardha | 0 | 2208 |
| Penganaga | -474 | 1362 |
| Maner | -273 | 521 |
| Middle Godavari | -6501 | -4658 |
| Deficit/Excess | -4447 | 16112 |
| | -157 TMC | 569 TMC |

2. **Water Balance Study by CWC**
CWC in its Report No. 1/2018/N&W has concluded that as per the allocations by Godavari Water Dispute, "there are no surplus waters at 75% dependability. The surplus waters available at 50% dependability are 387.75 TMC".

*గోదావరిలో మిగులుజలాలపై ఎన్‌డబ్ల్యూడీఏ, కేంద్ర జల సంఘం అధ్యయనాలు చెప్పిన వివరాలు ఇవి...*

*గోదావరిలో ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోలేకపోతున్న 147.86 టీఎంసీల మిగులు జలాలను గోదావరి-కావేరీ అనుసంధానం కింద తమిళనాడుకు తరలిస్తామని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) జీసీ లింకు ప్రాజెక్టు నివేదికలో స్పష్టం చేసింది. దీంతో వెంటనే అప్రమత్తమైన ఛత్తీస్‌గఢ్.. 'మా నీళ్లు మేం వాడుకోకపోవడమేంది?!' అని ఇంద్రావతి (గోదావరి సబ్‌బేసిన్)పై రెండు ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది. రూ. 29వేల కోట్లతో బోధ్‌ఘాట్ ఆనకట్ట, రూ.20వేల కోట్లతో మహానది-ఇంద్రావత్తి లింకు ప్రాజెక్టుల్ని తయారుచేసింది. 359 గ్రామాల పరిధిలోని 9.45 లక్షల ఎకరాలకు తాగు, సాగునీటితో పాటు పారిశ్రామిక అవసరాలకు 140 టీఎంసీల వరకు వినియోగించుంటామని కేంద్రం ముందు ప్రతిపాదనలు ఉంచింది. కేంద్ర ప్రభుత్వం సైతం అనుమతినిచ్చిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ప్రకటించారు.*

***- గోదావరి బేసిన్‌లో తెలంగాణకు ఎగువన ఉన్నది ఛత్తీస్‌గఢ్. అక్కడ ఉన్నది బీజేపీ ప్రభుత్వం.***

*బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం గోదావరిలో ఆంధ్రప్రదేశ్‌కు సంక్రమించిన నీటి కేటాయింపులు 518 టీఎంసీలు. ఇప్పటికే ఆ రాష్ట్రం ధవళేశ్వరం, పోలవరంతో పాటు ఇతర ప్రాజెక్టుల కింద కేటాయింపుల కంటే ఎక్కువ నీటిని వాడుకుంటున్నది. అయినప్పటికీ కేంద్రంలోని బీజేపీ తమిళనాడుకు గోదావరి జలాలను తరలిస్తామని అనడంతో వెంటనే పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి జలాలతో బనకచర్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. ఇతర బేసిన్లలోని ప్రతి మూలకు గోదావరిని తరలించి తాగు, సాగునీటిని అందించేందుకు రూ. 80వేల కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు నివేదికను ఏపీ సీఎం చంద్రబాబు స్వయంగా ఢిల్లీ వెళ్లి కేంద్రానికి సమర్పించారు. ఈ మేరకు ఇప్పటికే కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ టీవోఆర్‌ను ఖరారు చేసి సూత్రప్రాయంగా ప్రాజెక్టుకు అనుమతినిచ్చింది.*


***- గోదావరి బేసిన్‌లో తెలంగాణకు దిగువన ఉన్నది ఆంధ్రప్రదేశ్. అక్కడ ఉన్నది బీజేపీ మిత్రపక్షమైన తెలుగుదేశం-జనసేన కూటమి ప్రభుత్వం.***

*ఎగువన ఛత్తీస్‌గఢ్ తన హక్కుని కాపాడుకునేందుకు వెంటనే రంగంలోకి దిగింది. దిగువన ఆంధ్రప్రదేశ్ సందట్లో సడేమియాలో తన వాటా కంటే ఎక్కువ నీటిని వాడుకునేందుకు సిద్ధమైంది. అంటే నడుమన ఉన్న తెలంగాణ నోట్లోనే మట్టి!! అందరినీ మభ్య పెట్టి సముద్రంలో కలిసే వృథాజలాలే అని ఏపీ సీఎం చంద్రబాబు సూత్రీకరిస్తున్నారు. కానీ అసలు గోదావరిలో 3 వేల టీఎంసీల వృథా అనేదే ఒట్టి బూటకం. ఇందులో సింహభాగం బేసిన్‌లోని రాష్ట్రాలు వాడుకోకుండా ఉన్న నీళ్లే దిగువకు వెళ్లి సముద్రంలో కలుస్తున్నాయి. అంతమాత్రాన అవి వృథా, మిగులు జలాలు కావు. ఎగువన రాష్ట్రాలు వాడుకోకపోవడంతో వరద రూపంలో సముద్రంలోకి పోతున్నాయంతే. ఈ క్రమంలో ఒక రాష్ట్ర ప్రభుత్వంగా రేవంత్ సర్కారు లోతుగా అధ్యయనం చేసి రాబోయే ముప్పును నివారించాల్సిందిపోయి కావేరీకి గోదావరిజలాల తరలింపుపై నేటికీ పల్లెత్తు మాట్లాడటం లేదు. ఏపీ బనకచర్లపై ఏకంగా తానే ఒకడుగు ముందుకేసి చర్చలకు ఆహ్వానిస్తాననడం తెలంగాణ రైతాంగంలో ఆందోళన కలిగిస్తున్నది.*

# ముందుచూపుతోనే మేడిగడ్డ

- **కేసీఆర్ ప్రభుత్వం బరాజ్ నిర్మాణం**
- **ఎగువ రాష్ట్రాలు తమ కేటాయింపుల్ని వాడుకుంటాయని నిరూపించిన ఛత్తీస్‌గఢ్**

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఇంద్రావతి నీళ్లను వాడుకుంటామని ఛత్తీస్‌గఢ్ ప్రకటించడం తెలంగాణకు నష్టదాయకమే అయినప్పటికీ అది నగ్న సత్యాన్ని కూడా మన ముందుకు తెచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం తమ్మిడిహెట్టి బదులు మేడిగడ్డను బరాజ్ నిర్మాణానికి ఎంపిక చేయడం ఎంత కరెక్టో అది రుజువు చేసింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌లో తమ్మిడిహట్టి దగ్గర 165 టీఎంసీల నీటి లభ్యత ఉంటే అందులో 160 టీఎంసీలు మళ్లించుకుంటామని వైఎస్ ప్రభుత్వం డిజైన్ రూపొందించింది. కానీ కేంద్ర జల సంఘం అన్ని లెక్కలు తీసి 165 టీఎంసీల లభ్యత నిజమే అయినప్పటికీ ఎగువన మహారాష్ట్రకు హక్కుభుక్తంగా కేటాయించిన 63 టీఎంసీలు ఇంకా వాడుకోవడం లేదు. ఇకముందు వాళ్లు వాడుకుంటే ఇందులో లోటు ఏర్పడుతుందని స్పష్టంగా 2015లోనే తన లేఖలో చెప్పింది. తద్వారా 102 టీఎంసీల నీటి లభ్యతనే ఉన్నదని, అందునా తమ్మిడిహట్టి దగ్గర బరాజ్‌ను 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తేనే సుమా! అని కూడా హెచ్చరించింది. అందుకే కేసీఆర్ ప్రభుత్వం వ్యాప్కోస్ నివేదిక ప్రకారం దిగువన మేడిగడ్డ దగ్గర ప్రధాన బరాజ్ నిర్మాణాన్ని చేపట్టింది. ఇక్కడ 284.3 టీఎంసీల నీటి లభ్యత ఉందని కేంద్ర జల సంఘం నిర్ధారించి హైడ్రాలజికల్ అనుమతులు కూడా ఇచ్చింది. కేంద్ర జల సంఘం హెచ్చరికను విస్మరించినట్లయితే ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌పై ఇంద్రావతి ప్రాజెక్టు కడుతున్నట్టు రేపు ప్రాణహిత ఉపనదులపై మహారాష్ట్ర ప్రాజెక్టులు కట్టి 63 టీఎంసీలు వాడుకుంటే కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారేది. అంటే, ఎగువ రాష్ట్రాలు తమ కేటాయింపుల్ని ఏదో ఒకరోజు వాడుకుంటాయనేది వాస్తవం. అందుకు నిదర్శనమే ఛత్తీస్‌గఢ్. ఆ రాష్ట్రం తన 147.86 టీఎంసీలను వాడుకోనందున ఆ నీటిని కావేరీకి పట్టుకుపోతామని కేంద్రం నివేదికలో చెప్పింది. కానీ అదే కేంద్రం ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ రూ.49 వేల కోట్లతో చేపట్టే రెండు ప్రాజెక్టులకు అనుమతినిచ్చింది. అంటే తన కేటాయింపును వాడుకోనుంది.



Further, in respect of Godavari (Inchampalli)-Krishna (Nagarjunasagar)-Pennar (Somasila)-Cauvery (Manimukta) Link Project, due to pending of the finalization of the Himalayan Component and Mahanadi-Godavari Link Project, the DPR of the Godavari (Inchampalli)-Cauvery Link Project was prepared by NWDA based on the unused share of the Chhattisgarh for transfer of 4189 MCM (147.86 TMC) and circulated to party States during January, 2024. The Godavari-Cauvery link covers most of the drought prone and fluoride areas in Telangana, AP and Tamil Nadu and supply of drinking water to Karnataka and Puducherry.

*ఛత్తీస్‌గఢ్ వాడుకోని నీటిని కావేరి అనుసంధాన ప్రాజెక్టు ద్వారా తరలించుకుపోతామని పేర్కొన్న ఎన్‌డబ్ల్యూడీఏ*



*తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, చిత్రంలో బీఆర్ఎస్ నేతలు*

# కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌పై బీఆర్ఎస్ భగ్గు..

**ఖండించిన మాజీ మంత్రి హరీశ్‌రావు, మండలిలో ప్రతిపక్షత నేత సిరికొండ**

హైదరాబాద్, జూన్ 21 (నమస్తేతెలంగాణ): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌పై బీఆర్ఎస్ నేతలు భగ్గుమన్నారు. ప్రజాసమస్యలపై నిత్యం ప్రశ్నిస్తుండటాన్ని సహించలేకే రేవంత్ సర్కారు నిర్బంధకాండకు దిగుతున్నదని మండిపడ్డారు. అడుగడుగునా నిలదీయడాన్ని సహించలేకే దుర్మార్గాలకు ఒడిగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు, ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతగాక అణచివేత చర్యలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికుట్రలు చేసినా, అక్రమ కేసులు బనాయించినా తలవంచబోమని తేల్చిచెప్పారు. నిత్యం ప్రజాక్షేత్రంలో సర్కారు దమననీతిని ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు.

### నిలదీస్తున్నందుకే నిర్బంధం: సిరికొండ

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాక్షేత్రంలో ఎండగడుతున్నందునే రేవంత్ సర్కారు కౌశిక్‌రెడ్డిని నిర్బంధించిందని మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను ఖండించారు. ప్రభుత్వం ఇప్పటికే కౌశిక్‌రెడ్డిపై అనేక అక్రమ కేసులు బనాయించిందని పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లకుండా శని, ఆదివారాల్లో అరెస్ట్ చేసి రాక్షసానందం పొందుతున్నదని మండిపడ్డారు. అక్రమ నిర్బంధాలను న్యాయస్థానాల ద్వారా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. కేసులు, అణచివేతలకు బీఆర్ఎస్ భయపడబోదని హెచ్చరించారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. హామీల అమలు చేతగాక అక్రమ అరెస్ట్‌లకు దిగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. కృష్ణుడు కూడా శిశుపాలుడి వంద తప్పులను భరించారు.. అదే తరహాలో వరుసగా తప్పులు చేస్తున్న రేవంత్ ప్రభుత్వాన్ని ప్రజలు భరించేందుకు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. శిక్షించేందుకు ఎదురు చూస్తున్నారని తేల్చిచెప్పారు.

### పాలన గాలికొదిలి కక్ష సాధింపు దుర్మార్గం: హరీశ్‌రావు

పాలనను గాలికొదిలి, రాజకీయ కక్ష సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కారు ముందుకెళ్తున్నది. ఇందులో భాగంగానే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసిందని శనివారం ఎక్స్ వేదికగా ఖండించారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకొనే రేవంత్‌రెడ్డి, ఆనాటి ఎమర్జెన్సీని తలపించేలా పాలన సాగిస్తున్నరు. అక్రమ కేసులు, నిర్బంధాలు బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయబోవని స్పష్టం చేశారు. శుక్రవారం అరెస్టులు చేయవద్దని కోర్టులు చెప్పినా ప్రభుత్వం వినడం లేదని మండిపడ్డారు. కౌశిక్‌రెడ్డిపై పగబట్టి ఫాల్తు కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కౌశిక్‌రెడ్డి ఎవరినైనా మోసం చేశారా? మర్డర్ చేశారా? ఎందుకు అరెస్టు చేశారంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రజల పక్షాన కౌశిక్‌రెడ్డి పోరాటం చేశారని, అది నచ్చక అయనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు.

# ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్ట్..బెయిల్

- **విదేశీ పర్యటన ముగించుకొని వస్తుండగా దుశ్చర్య**
- **శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్న పోలీసులు**
- **సాయంత్రం అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు**
- **రిమాండ్ తిరస్కరించి బెయిల్ మంజూరు చేసిన జడ్జి**
- **పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్**
- **కౌశిక్‌పై రేవంత్ సర్కారు కక్ష: వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



*వరంగల్ ఎంజీఎం దవాఖాన అత్యవసర విభాగంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు*

వరంగల్, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులపై కాంగ్రెస్ ప్రభుత్వ వేధింపుల పరంపర కొనసాగుతున్నది. హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని శనివారం మరోసారి అరెస్ట్ చేసింది. విదేశీ పర్యటన ముగించుకొని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనను అదుపులోకి తీసుకుంది. హనుమకొండకు చెందిన గ్రానైట్ వ్యాపారి కట్టా మనోజ్‌రెడ్డిని బెదిరించినట్టుగా ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హనుమకొండలోని సుబేదారి స్టేషన్‌లో ఏప్రిల్ 22న నమోదైంది. ఇదే కేసును సాకుగా చూపుతూ పోలీసులు కౌశిక్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని హనుమకొండకు తీసుకొచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుబేదారి పోలీసు స్టేషన్‌లోనే ఉంచారు. బీఎన్ఎస్‌లోని 308(2), 308(4), 308(5), 354 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మధ్యాహ్నం తర్వాత వరంగల్‌లోని ఎంజీఎంలో కౌశిక్‌రెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సాయంత్రం కోర్టుకు తీసుకెళ్లారు. అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ సెలవులో ఉండటంతో ఇన్‌చార్జిగా ఉన్న కాజీపేట రైల్వే కోర్టు జడ్జి నాగలీల సుష్మిత ఎదుట కౌశిక్‌రెడ్డిని హాజరు పరుచగా, ఆమె బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చారు.

### కేసు నమోదు ఇలా..

హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపురం మండలం వంగపల్లిలో ఉన్న క్వారీని హనుమకొండకు చెందిన మనోజ్‌రెడ్డి నిర్వహిస్తున్నాడు. రూ.50 లక్షలు ఇవ్వాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బెదిరించారని మనోజ్‌రెడ్డి భార్య ఉమాదేవి ఫిర్యాదు చేయడంతో సుబేదారి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఆయన అరెస్టుపై హైకోర్టు స్టే విధించింది. అయితే ఈ కేసును కొట్టివేయాలని కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను జూన్ 16న హైకోర్టు తిరస్కరించింది. విచారణను ఎదుర్కోవాలని ఆదేశించింది. శనివారం ఆయనను అరెస్టు చేసి అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. అయితే ఈ అక్రమ కేసుపై బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. తొలుత పిటిషన్‌లో బీఎన్ఎస్‌లోని 308(2), 308(4), 352 సెక్షన్ల నమోదు ప్రకారం విచారణ చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారని, తాజాగా 308(5) సెక్షన్‌ను అదనంగా జత చేశారని పేర్కొన్నారు.

### సుబేదారి పీఎస్‌కు బీఆర్ఎస్ శ్రేణులు

కౌశిక్‌రెడ్డి అరెస్టు సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలు సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, చల్లా ధర్మారెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి, ఇతర నేతలు వచ్చారు. బీఆర్ఎస్ ముఖ్యనేతలు వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్‌ను కలిశారు. ఎఫ్ఐఆర్‌లో మొదట పేర్కొన్న సెక్షన్లను మార్చారని వివరించారు. పాడి కౌశిక్‌రెడ్డి సతీమణి శాలినిరెడ్డి, సోదరుడు ప్రతీక్‌రెడ్డిని కలిశారు. అంతకముందు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ పోలీసుస్టేషన్‌లో ఉన్న కౌశిక్‌రెడ్డిని కలిసేందుకు వెళ్లడంతో పోలీసులు అనుమతించలేదు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డిని కలిసేందుకు వినయభాస్కర్‌కు పోలీసులు అనుమతి ఇచ్చారు. కౌశిక్‌రెడ్డి అరెస్ట్ నేపథ్యంలో భారీగా బలగాలను మోహరించడంతో పాటు బారికేడ్లను అడ్డుపెట్టారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సుబేదారి జంక్షన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ తగులబెట్టే ప్రయత్నం చేశారు. పోలీసులు, బీఆర్ఎస్వీ శ్రేణుల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకొని వారిని మడికొండ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

### అరెస్టు దుర్మార్గం: ఎర్రబెల్లి

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి దయాకర్‌రావు మండిపడ్డారు. ఇది సీఎం నిరంకుశ వైఖరికి నిదర్శమని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్రమాలు, మంత్రుల అవినీతి, కాంగ్రెస్ నేతల దుర్మార్గాలను అడుగడునా ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై కక్షకట్టి అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలు అని చెప్పి బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి చిల్లర చేష్టలు, పనికిరాని కేసులు, బీఆర్ఎస్ నేతల సంకల్పాన్ని, మనోధైర్యాన్ని దెబ్బతీయలేవని చెప్పారు.

### కాంగ్రెస్ కక్షపూరిత చర్య: దాస్యం

కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్ఎస్ నేతలపై అక్రమ, కుట్రపూరిత కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మండిపడ్డారు. ప్రజల తరపున పోరాటాలను ఆపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. జై తెలంగాణ అంటున్న తమ నాయకులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు కుట్రలు, వేధింపులను ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని చెప్పారు.

## కౌశిక్‌పై రేవంత్ సర్కారు కక్ష

- **అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసులు: కేటీఆర్**



హైదరాబాద్, జూన్ 21 (నమస్తేతెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేల అక్రమాలను అడుగడుగునా ప్రశ్నిస్తున్నందుకే హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కౌశిక్‌ను అరెస్ట్ చేయడం హేయమని శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. ఏడాదిన్నరగా రేవంత్ పాలనా వైఫల్యాలపై నిలదీస్తున్న కౌశిక్‌ను అణచివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని నెలల నుంచీ కుట్రలు చేస్తున్నదని దుయ్యబట్టారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఎమర్జెన్సీ పాలన తెచ్చారని విమర్శించారు. ప్రశ్నించే గొంతులపై అణచివేత చర్యలతో ప్రజాక్షేత్రంలో అబాసుపాలవుతున్నాడని, పాలనా వైఫల్యాలు, దారుణాలను కప్పిపుచ్చుకొనేందుకే అడ్డగోలు అరాచకాలకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. రేవంత్ చిల్లర చేష్టలు, పనికిరాని కేసులు, బీఆర్ఎస్ నేతల సంకల్పాన్ని ఎప్పటికీ దెబ్బతీయలేవని స్పష్టంచేశారు. రేవంత్ నియంత పాలనపై పోరాడుతూనే ఉంటామని హెచ్చరించారు. అసమర్థ సీఎం ఆదేశాలతో అరెస్ట్ చేసిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## కేసులకు భయపడి ప్రశ్నించడం ఆపబోం

- **ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి**

హైదరాబాద్, జూన్ 21 (నమస్తేతెలంగాణ)/శంషాబాద్ రూరల్/సుబేదారి: నోటీసులివ్వకుండా తనను అరెస్ట్ ఎట్లా చేస్తారంటూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పోలీసులను ప్రశ్నించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు అరెస్టు చేసేందుకు రాగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో పోలీసులు పనిచేయడం దౌర్భాగ్యమంటూ మండిపడ్డారు. కమలాపూర్ మండలం గుండేడులో అక్రమ క్వా రీపై ప్రశ్నించినందుకే తనను అరెస్టు చేస్తున్నారని తెలిపారు. 'నాకు బెయిల్ మం జూరు కావడానికి కృషి చేసిన బీఆర్ఎస్ పార్టీ లీగల్ టీమ్‌కు చేతులు జోడించి నమస్కారం చేస్తున్న. కాంగ్రెస్ ఎమ్మెల్యేల బండారాన్ని రేపు హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ ద్వారా బయట పెడుతా. నాకు అండగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ నాయకత్వానికి, కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు' అని తెలిపారు.

### ప్రజాస్వామ్యం అపహాస్యం

ప్రశ్నిస్తున్న వారిని అరెస్ట్ చేస్తూ కాంగ్రెస్ సర్కారు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నది. పాడి కౌశిక్‌రెడ్డిని ఎయిర్‌పోర్ట్‌లోనే అరెస్ట్ చేయడం దారుణం. పాలకుల తప్పిదాలను ఎత్తిచూపుతున్న ప్రజాప్రతినిధులు, సోషల్ మీడియా వారియర్స్‌పై అక్రమ కేసులు పెట్టడం సరికాదు. కక్షలు, అక్రమ కేసులు పక్కనపెట్టి పాలనపై దృష్టి పెట్టాలి.

**- వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ**

### ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు

అక్రమ కేసులు, అణచివేతలతో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నియంత పాలన నడిపిస్తున్నారు. ప్రజల తరపున ప్రశ్నిస్తుంటే ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులపై దౌర్జన్యానికి దిగుతున్నారు. అక్రమ కేసులు పెట్టడంపై ఉన్న శ్రద్ధ పథకాలు, ఇచ్చిన హామీల అమలుపై రేవంత్‌రెడ్డికి లేదు.

**-వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ మంత్రి**

### రాష్ట్రంలో నిరంకుశ పాలన

రాష్ట్రంలో ప్రజాపాలన ముసుగులో నిరంకుశ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. సర్కారు తప్పిదాలను ఎత్తిచూపుతున్న కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయడమే ఇందుకు నిదర్శనం. 420 హామీలు అమలు చేయడం చేతగాకే అరెస్ట్‌ల పేరిట ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల తరపున పోరాటం ఆపబోం.

**-కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి**

### రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ

రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దుర్మార్గపు పాలన అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్నది. అక్రమ అరెస్ట్‌లతో ప్రధాన ప్రతిపక్షం హక్కులను కాలరాస్తున్నారు. విదేశాల నుంచి వచ్చిన క్షణమే ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయడం సర్కారు దమనకాండకు నిదర్శనం.

**-సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి**

### అక్రమ కేసులు సరికాదు

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై అక్రమకేసులు బనాయించడం సరికాదు. విదేశ పర్యటన నుంచి రాగానే విమానాశ్రయంలోనే అదుపులోకి తీసుకోవడం కక్ష సాధింపే. ఇది మంచిది కాదు.

**-వినోద్‌కుమార్, మాజీ ఎంపీ**

### అక్రమాలను నిలదీస్తే కేసులు

కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలను నిలదీస్తున్నందుకే బీఆర్ఎస్ శ్రేణులపై కేసులు పెడుతున్నారు. కౌశిక్‌రెడ్డిపై ఎన్నో తప్పుడు కేసులు బనాయించారు. తక్షణమే ఉపసంహరించుకోవాలి.

**-పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగాం ఎమ్మెల్యే**